# ఆళవందార్ స్తోత్రము

మన పెద్దలు మూడింటిని 'రత్నాలు' గా పేర్కొన్నారు. అందులో 'స్తోత్రరత్నం' గా వన్నెకెక్కినది "ఆళవందార్ స్తోత్రము ".ఈ స్తోత్రాన్ని మనకి అనుగ్రహించినవారు "యామునాచార్యులు ". వీరి యొక్క మరొక ప్రసిద్ధ నామం "ఆళవందార్ ".ఈ స్తోత్రం లో యామునులు భగవంతుని యొక్క స్వరూప రూప గుణ విభూతులన్నింటినీ సాకల్యంగా విశదీకరించారు. భగవద్రామానుజులు ప్రతి రోజూ బ్రాహ్మీ ముహూర్తాన మేల్కొని తమ అంతరంగ శిష్యులతో కలసి ఈ స్తోత్రాన్ని అనుసంధించేవారట. అరవై ఐదు శ్లోకాలు గల స్తోత్రం ఇది. యామునుల శ్రీపాద ద్వంద్వమందు ప్రావణ్యంగలవారు వారిని గూర్చి (యామునులనుగూర్చి)ప్రీతి తో పలికిన రెండు శ్లోకాలు ముందుగా మనకు దర్శనమిస్తాయి. "స్తోత్ర రత్నం "గా పేరొందిన ఈ స్తోత్రాన్ని ప్రతిపదార్థతాత్పర్య సహితంగా ఎందరో పెద్దలు మనకందించారు. వారిని అనుసరిస్తూ ఇవి ఇక్కడ పొందుపరచడం జరిగింది.

**శ్లో: స్వాదయ న్నిహ సర్వేషాం త్రయ్యన్తార్థం సుదుర్గహమ్|**
**స్తోత్రయామాస యోగీన్ద్ర స్తం వన్దే యామునాహ్వయమ్||**

**ప్రతిపదార్థము:**

యోగీన్ద్రః=యోగి శ్రేష్ఠుడు (ఆళవందారులు)
సుదుర్గహమ్ =గ్రహించుటకు అశక్యమైన
త్రయ్యన్తార్థం =ఉపనిషత్తులయొక్క అర్థమును
ఇహ =ఈ లోకమునందు
సర్వేషాం =అందరికినీ
స్వాదయన్ =అనుభవ యోగ్యంగా చేయుచూ
స్తోత్రయామాస =స్తోత్రముగా (చేసెనో)
యామునాహ్వయమ్ =యామునులు అను పేరుగల
తం = ఆ యోగీంద్రుని
వందే = నమస్కరించుచున్నాను.

**తాత్పర్యము:**

ఉపనిషదర్థాన్ని గ్రహించడం అందరికీ సులభసాధ్యం కాదు. అటువంటిదానిని ఈ లోకంలో అందరికీ అనుభవయోగ్యంగా చేయగలిగినదయింది ఈ స్తోత్రం. దీనిని యోగీంద్రులైన యామునులు రచించారు. ఆ యోగి శ్రేష్ఠుడైన యామున మునికి నమస్కరిస్తున్నాను.

**శ్లో: నమో నమో యామునాయ యామునాయ నమో నమః**
**నమో నమో యామునాయ యామునాయ నమో నమః.**

**ప్రతిపదార్థము:**

యామునాయ = యామున మునికొరకు
నమో నమః = నమస్కారము.
.........................
యామునుల విషయంలో తమకుగల ఆదరాతిశయంతో అనేకపర్యాయాలు ఈ విధంగా నమస్కరిస్తున్నారు.

**శ్లో: నమోఽచిన్త్యాద్భుతాక్లిష్ట జ్ఞాన వైరాగ్య రాశయే**
**నాథాయ మునయేఽగాధ భగవద్భక్తి సిన్ధవే. 1.**

**ప్రతిపదార్థము:**

అచిన్త్య = ఆలోచిండానికి శక్యము కాని

అద్భుత = ఆశ్చర్యకరమైన

అక్లిష్ట = క్లేశము లేని (భగవత్కృపచేత లభించిన)

జ్ఞాన = జ్ఞానమునకు

వైరాగ్య = వైరాగ్యమునకు

రాశయే = రాశియైన

అగాథ = లోతైన

భగవద్భక్తి = భగవద్భక్తికి

సింధవే = సముద్రమైన

నాథాయ మునయే = నాథ మునుల కొరకు

నమః = నమస్కారము.

**తాత్పర్యము:**

నాథమునులయొక్క జ్ఞానము భక్తి వైరాగ్యము తమ ప్రయత్నముచేత లభించినవి కావు. భగవద్భాగవత ఆచార్య కటాక్షంచేత లభించినవి. కనుకనే అవి అక్లిష్టములు. వీరు భగవద్భక్తికి సముద్రమువంటివారు. అటువంటి అపరిమితమైన జ్ఞాన వైరాగ్యములు భగవద్భక్తి కలిగిన నాథమునులకు నమస్కరించుచున్నాను.

**శ్లో: తస్మై నమో మధుజిదంఘ్రిసరోజతత్త్వ**
**జ్ఞానానురాగ మహిమాతిశయాన్తసీమ్నే**
**నాథాయ నాథమునయేఽత్ర పరత్ర చాపి**
**నిత్యం యదీయచరణౌ శరణం మదీయమ్ 2.**

**ప్రతిపదార్థము:**

అత్ర = ఇహ లోకమునందును (లీలా విభూతియందును)

పరత్ర చాపి = పై లోకమునందును (నిత్య విభూతియందును)

నిత్యం = ఎల్లప్పుడును

యదీయ = ఏ నాధమునుల

చరణౌ = శ్రీపాదముల జంట

మదీయం = నాకు

శరణం = రక్షకమో

మధుజిదంఘ్రిసరోజతత్త్వ జ్ఞానానురాగ మహిమాతిశయాన్తసీమ్నే _

మధుజిత్ = మధువను రాక్షసుని జయించిన భగవంతుని

అంఘ్రి సరోజ = పాద పద్మములయందు

తత్త్వ = యధార్థమైన

జ్ఞానానురాగ = జ్ఞాన భక్తుల యొక్క

మహిమాతిశయ = మహిమాధిక్యతకు

అంత సీమ్నే = సీమా భూమియైన

నాథాయ = స్వామియైన

తస్మై = ఆ

నాథమునయే = నాథమునులకొరకు

నమః = నమస్కారము.

**తాత్పర్యము:**

ఆశ్రిత వాత్సల్యంతో వారి ప్రతిబంధకాలను పోగొట్టేందుకై పరమాత్మ ఈ లోకంలో అనేక పర్యాయాలు అవతరించాడు. ఆ మధుసూదనుని పాదపద్మాల యధార్థ జ్ఞానం కలవారు నాథమునులు. కనుకనే వారికి భగవానుని పాద పద్మములయందు భక్తి అధికం. భగవద్భక్తికి సీమా భూమియే నాథమునులు. అటువంటి నాథమునుల చరణ ద్వయమే ఇహ పరములయందు నిత్యమూ నాకు శరణము.

**శ్లో: భూయో నమోఽపరిమితాచ్యుత భక్తి తత్త్వ**
**జ్ఞానామృతాబ్ధి పరివాహ శుభైర్వచోభిః**
**లోకేఽవతీర్ణ పరమార్థ సమగ్రభక్తి**
**యోగాయ నాథమునయే యమినాం వరాయ 3.**

**ప్రతిపదార్థము:**

అపరిమిత = అవధిలేని

అచ్యుతభక్తి = భగవద్భక్తియు

తత్త్వ జ్ఞాన = తత్త్వ విషయిక జ్ఞానము (అనే)

అమృతాబ్ధి = అమృతముతో నిండిన సముద్రముయొక్క

పరివాహ = ప్రవాహమువలె

శుభైః = నిర్మలములైన (మంగళకరములైన)

వచోభిః = వాక్కులచేత

లోకే = ఈ లోకమునందు(ఈ లీలావిభూతియందు)

అవతీర్ణ = అవతరించిన

పరమార్థ = ఉత్తమ పురుషార్థమైన

సమగ్ర = సంపూర్ణమైన

భక్తియోగాయ = భక్తి యోగముగల

యమినాం వరాయ =యోగి శ్రేష్ఠులైన

నాథమునయే = నాథమునులకొరకు

భూయః = మరల

నమః = నమస్కారము.

**తాత్పర్యము:**

అవధిలేని భగవద్భక్తికి, తత్త్వ జ్ఞానమునకు స్థానమైనవారు నాథమునులు. వారి ముఖమునుండి వెలువడిన వాక్కులు అమృత జలధియొక్క ప్రవాహమువలె చల్లనివి, భోగ్యములైనవి. నాథమునులు ఈ లీలా విభూతిలో అవతరించిన పరిపూర్ణ భక్తియోగ స్వరూపులు. అటువంటి యోగి శ్రేష్ఠులైన నాథమునులకు నమస్కారము.

**శ్లో: తత్త్వేన యశ్చిదచిదీశ్వర తత్స్వభావ**
**భోగాపవర్గ తదుపాయగతీ రుదారః**
**సన్దర్శయ న్నిరమిమీత పురాణరత్నం**
**తస్మై నమో మునివరాయ పరాశరాయ 4.**

**ప్రతిపదార్థము:**

ఉదారః =ఉదారుడైన
యః = ఎవరు (ఏ మహర్షి)
చిదచిదీశ్వర = జీవ, ప్రకృతి, ఈశ్వరులను
తత్స్వభావ = వాని స్వభావాలను
భోగ = సంసార భోగమును
అపవర్గ = మోక్షమును
తదుపాయగతీః = ఆ భోగ మోక్ష ములయొక్క ఉపాయమార్గములను
తత్త్వేన = యథార్థముగా
సందర్శయన్ = చూపించుచూ
పురాణ రత్నం = శ్రేష్ఠమైన పురాణమును (విష్ణు పురాణమును)
నిరమిమీత = నిర్మించెనో
తస్మై = ఆ
మునివరాయ = ముని శ్రేష్ఠుడైన
పరాశరాయ = పరాశరులకొరకు
నమః = నమస్కారము.

**తాత్పర్యము:**

మునీశ్వరులైన పరాశర మహర్షి చిత్, అచిత్, ఈశ్వరుడు అనే ఈ మూడు తత్త్వాల స్వభావాన్నీ యథార్థంగా విష్ణు పురాణంలో వివరించారు. సంసారమందలి విషయానుభవాన్నీ, స్వర్గ భోగాల్నీ ఆత్మానుభవాన్నీ, భగవదనుభవరూపమైన మోక్షాన్నీ వాటి సాధనమార్గాల్నీ స్పష్టంగా తెలియజేసారు. అటువంటి పురాణ రత్నమైన విష్ణుపురాణ కర్త పరాశర మహర్షికి నమస్కారము.

**శ్లో: మాతా పితా యువతయ స్తనయా విభూతిః**
**సర్వం యదేవ నియమేన మదన్వయానామ్**
**ఆద్యస్య నః కులపతే ర్వకులాభిరామం**
**శ్రీమత్తదఙ్ఘ్రి యుగళం ప్రణమామి మూర్ధ్నా 5.**

**ప్రతిపదార్థము:**

మదన్వయానాం = మా(జ్ఞాన ) వంశమువారికి (ముందువారికి, తరువాతివారికీ కూడా)
యదేవ = ఏదో (ఏ పాదముల జంట)
నియమేన = తప్పక
మాతా = తల్లి
పితా = తండ్రి
యువతయః = స్త్రీలు
తనయాః = పుత్రులు
విభూతిః = ఐశ్వర్యము

సర్వం = సమస్తమూ (అయినదో)

ఆద్యస్య = మొదటివారైన

నః = మాయొక్క

కులపతేః = కులపతియైన నమ్మాళ్వార్లయొక్క

వకుళాభిరామం = పొగడ పూవులచేత మనోహరమైన

శ్రీమత్ = సంపదగల

తత్ = ఆ

అఙ్ఘ్రి యుగళం = పాదముల జంటను

మూర్ధ్నా = శిరస్సుచేత

ప్రణమామి = నమస్కరించుచున్నాను.

**తాత్పర్యము:**

మా ప్రపన్న కులంలోని ముందు తరాలవారికి, వెనుక తరాలవారికీ కూడా "కులపతులు " నమ్మాళ్వార్లు. వారే మాకు తల్లి, తండ్రి, స్త్రీలు, సంతానం, సంపదకూడా. మా కులానికి వారే మూలపురుషులు. పొగడ పూవులచేత అలంకరింపబడిన వారి పాదాల జంటను శిరసా నమస్కరిస్తున్నాను.